క్లుప్తంగా

శ్మశాన వాటికలు కేటాయించాలి

గురజాల: దళితులకు శ్మశాన వాటికలు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా గుంటూరు అధ్యక్షుడు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ కోరారు. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం రెవెన్యూ డివిజనల్ అధికారి, తహసీల్దార్, గ్రామ రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. దళితుల సత్వరమే శ్మశాన వాటికలు బాగుపరచాలని, లేనియెడల స్థలం సేకరించి శ్మశాన వాటికకు కేటాయించాలని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశించారన్నారు. అదే విధంగా పల్నాడు జిల్లాలో ప్రతి గ్రామంలో విచారణ జరిపి శ్మశాన వాటిక లేని గ్రామాల్లో సత్వరమే శ్మశాన వాటిక ఏర్పాటుచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ డివిజనల్ అధికారి కె.అద్దెయ్య, తహసీల్దార్ మీసాల దానియేలుకు వినతిపత్రం అందించారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ కర్రా ప్రగతి కోటేశ్వరరావు, కలకండ అంద్రెయ్య, కనకం ఆదినారాయణ దత్తు, బంకా జయనాస్ కుమార్, కలకండ ప్రకాష్, వార్డు కౌన్సిలరు కత్తి రవిబాబు, తదితరులున్నారు.

క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఈ నెల 12 నుంచి 14 వరకు బిహార్‌లోని పాట్నాలో జరగనున్న 18వ జాతీయ అంతర్ రాష్ట్రాల అథ్లెటిక్ పోటీల్లో పాల్గొనే 13 మంది క్రీడాకారులకు రేమాండ్స్ షోరూమ్ అధినేత హరికృష్ణ, గుంటూరు రౌండ్ టేబుల్ లేడీస్ సర్కిల్ 39 చైర్‌పర్సన్ మధుస్మితలు క్రీడా దుస్తులు బహూకరించారు. మంగళవారం స్థానిక చంద్రమౌళి నగర్‌లోని నాథ్‌వెల్‌నెస్ సెంటర్లో క్రీడాకారులను అభినందించడంతోపాటు దుస్తులు అందజేశారు. మధుస్మిత మాట్లాడుతూ పతకాలతో జిల్లాకు పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో అథ్లెటిక్ సంఘం జిల్లా కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్, మాజీ అంతర్జాతీయ అథ్లెట్ కృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

టీఎంబీలో ఎంఎస్ఎంఈ రుణసదుపాయం

కొరిటిపాడు: ప్రముఖ ప్రైవేటు బ్యాంక్ సంస్థ తమిళనాడ్ మర్కంటైల్ బ్యాంక్(టీఎంబీ) లిమిటెడ్ ఆధ్వర్యంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు క్రెడిట్ రుణ సదుపాయం పెంచుట అనే అంశంపై గుంటూరులోని ఓ ప్రైవేటు హోటల్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి బ్యాంక్ హైదరాబాద్ రీజనల్ మేనేజర్ ఎం.రాజప్పన్, గుంటూరు బ్రాంచ్ చీఫ్ మేనేజర్ సి.దినకర్ జెబా కుమార్, జనరల్ మేనేజర్ (క్రెడిట్)ఎస్.నారాయణన్‌లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బ్యాంక్ ద్వారా సుమారు 20 మంది రూ. 50 కోట్ల వరకు రుణ సదుపాయం పొందేందుకు అర్హులను ప్రకటించారు. బ్యాంక్ వినియోగదారులు, అధికారులు, చేబ్రోలు, చీరాల, చిలకలూరిపేట, నరసరావుపేట, పెదనందిపాడు బ్రాంచ్‌ల సిబ్బంది పాల్గొన్నారు.

చిట్స్ కంపెనీపై కేసు నమోదు

పట్నంబజారు: ప్రభుత్వ అనుమతులు లేకుండా చిట్టీలు వేస్తున్న కంపెనీపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట గౌడీయమఠం సమీపంలో ఉన్న శ్రీ గోకులం చిట్స్ అండ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో కార్యాలయాన్ని ఏర్పాటు చేసి ఎటువంటి అమతులు లేకుండా చిట్‌ఫండ్ కంపెనీ, ఫైనాన్స్ చేస్తూ.. వసూళ్ల కోసం నోటీసులు జారీ చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. ఈ క్రమంలో కొంత మంది బాధితుల ఫిర్యాదు మేరకు గత కొద్ది రోజుల క్రితం రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ ఎంపీ సుబ్బారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

గుంటూరు ఈస్ట్: ఆత్మహత్యాయత్నం చేసి జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన సంఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏటీ అగ్రహారంకు చెందిన సంతోష్ కుమార్ బెహరా భార్య రూపాలిపాత్రో (24) ను భర్త, అత్తమామలు వేధింపులకు గురిచేశారు. ఈక్రమంలో ఆమె సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. తీవ్రగాయాలపాలైన ఆమెను జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. మృతదేహాన్ని మార్చురీకి తరలించి, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మార్చి 15 నాటికి నూరుశాతం పన్నులు వసూలు చేయాలి

నెహ్రూనగర్: మార్చి 15 నాటికే పన్ను వసూళ్లు నూరు శాతం పూర్తి కావాలని, అందుకు తగిన విధంగా ఆర్ఐల వారీగా లక్ష్యాలను నిర్దేశించామని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పెద్ది రోజ తెలిపారు. మంగళవారం అదనపు కమిషనర్ తమ చాంబర్‌లో పన్ను వసూళ్లపై డెప్యూటీ కమిషనర్లు, ఆర్ఓలు, ఆర్ఐలతో ప్రత్యేక సమీక్ష చేసి, డిశంబర్ 31న ఒక్కరోజు కలెక్షన్‌లో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో గుంటూరు నగరపాలక సంస్థ నిలవడంలో కృషి చేసిన రెవెన్యూ విభాగాన్ని అభినందించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ నగరంలో రూ.144 కోట్ల డిమాండ్‌కు గాను, ఇప్పటి వరకు రూ.75.20 కోట్లు వసూళ్లు కాగా మిగిలిన రూ.68.8 కోట్లు బకాయి వసూళ్లకు బుధవారం నుంచే ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, మేనేజర్ శివన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కొనితెచ్చుకుంటున్నారు

గతంలో అమ్మమ్మలో, నాయనమ్మలో 'జీర్ణం.. జీర్ణం.. వాతాపి జీర్ణం..' అంటూ శిశువులకు ఉగ్గుపట్టిస్తూ ఉండేవారు. రానున్న రోజుల్లో శిశువు తినే పదార్థాలు ఇట్టే అరిగిపోవాలని, బాగా జీర్ణం కావాలని అలా చేస్తూ జీర్ణవ్యవస్థ ప్రాముఖ్యతను చాటేవారు. నేడు వేళాపాలా లేని ఆహార సమయాలు.. మసాలాలు, రంగులతో నిండిన జంక్ ఫుడ్స్, నిద్రలేమి, ఇతరత్రా కారణాలతో అనేకులు 'గ్యాస్ట్రిక్' సమస్యలను 'కొని'తెచ్చుకుంటున్నారు. త్వరగా మేల్కొనకపోతే ఇది అనేక విపరిణామాలకు దారి తీస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు..



- జీర్ణకోశ వ్యాధులపై అవగాహన అవసరం
- రోజురోజుకు పెరుగుతున్న బాధితులు
- జీవనశైలి మార్పులే వ్యాధులకు కారణం

గుంటూరు మెడికల్: పాశ్చాత్య ఆహారశైలికి అలవాటు పడడంతో అనేక మంది నేడు జీర్ణకోశ సమస్యలతో గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులను సంప్రదిస్తున్నారు. అర్ధరాత్రుల వరకు విధులు నిర్వహిస్తూ వేళాపాళాలేకుండా ఆహారం తీసుకుంటూ సరిపడా నిద్ర లేకపోవడంతో అనేక మంది నేడు జీర్ణకోశ వ్యాధుల బారిన పడుతున్నారు. వ్యాధులపై సరైన అవగాహన లేకపోవడంతో తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. కొద్దిపాటి అవగాహన కలిగి ఉంటే జీర్ణకోశ వ్యాధులను కట్టడి చేయవచ్చని గ్యాస్ట్రోఎంట్రాలజిస్టులు వెల్లడిస్తున్నారు.

పసర్లు, వాతలతో ప్రాణాలు పోగొట్టుకోవద్దు..

అనేక మంది కామెర్ల వ్యాధి సోకగానే ఆకుపసర్లు మింగుతూ, చేతులకు కాల్చిన వాతలు పెట్టుకుంటూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ప్రతి వంద మందిలో ఐదుగురికి ఏ జబ్బులేకుండానే కళ్లుపచ్చగా ఉంటాయి. దీనిని గిల్‌బర్ట్ సిండ్రోమ్ అంటారు. కామెర్లకు ఎలాంటి పత్యం చేయాల్సిన అవసరం లేదు. ఎంత ఎక్కువగా తింటే కామెర్లు అంత తొందరగా తగ్గుతాయి. కామెర్లు రాకుండా ఉండాలంటే కాచిచల్లార్చిన నీటిని మాత్రమే తాగాలి. ఇంట్లో వండిన వంట తినాలి. ఐస్‌తో కూడిన పదార్థాలు తినకూడదు.

హెపటైటీస్‌కు వ్యాక్సిన్‌తో చెక్..

హెపటైటీస్ బీ అనే వ్యాధి ప్రతి వంద మందిలో ఐదుగురికి ఉంటుంది. వీరిలో 70 శాతం మందికి ఎలాంటి సమస్య ఉండదు. హెపటైటీస్ బీ ఉన్నవారు ఏ ఇబ్బంది లేనప్పటికీ కనీసం ఆరు నెలలకొకసారి డాక్టర్‌ను సంప్రదించాలి. ఈ వ్యాధి ఎక్కువ శాతం మందికి చిన్న వయస్సులోనే తల్లిద్వారా లేదా తోటి పిల్లల ద్వారా సంక్రమిస్తుంది. కొద్దిమందికి మాత్రమే పెద్ద వయస్సులో ఒకరికి వాడిన సిరంజులు వినియోగించి చేయడం ద్వారా, అక్రమ శారీరక సంబంధాల ద్వారా వస్తుంది. పిల్లలకు హెపటైటీస్ ఏ, బీ వ్యాక్సిన్ వేయించడం ద్వారా వ్యాధిసోకకుండా చెక్ పెట్టవచ్చు.

ఛాతీలో మంట?

అనేక మంది ఆధునిక జీవన శైలి వల్ల నేడు ఛాతీలో మంట సమస్యతో బాధపడుతూ గుండె జబ్బు అనుకొని భయపడుతున్నారు. శారీరక బరువు ఎక్కువగా ఉండి, ఏదైనా ఆహారం తినగానే తేపులు, ఛాతిలో మంట వస్తుంటే అది గ్యాస్ వల్ల కూడా రావచ్చు. పొట్టలో నొప్పి, ఛాతీలో మంట సమస్యకు నెలల తరబడి మాత్రలు వాడకూడదు. రెండు వారాలు మందులు వాడి తగ్గకపోతే వెంటనే గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టును సంప్రదించి గ్యాస్ట్రోస్కోపి చేయించుకోవాలి.

నడకతో వ్యాధులకు చెక్..

యాంత్రిక జీవనానికి అలవాటు పడి అనేక మంది శారీరక వ్యాయామాన్ని మరిచిపోవడం వల్ల గ్యాస్ట్రో ఎంట్రాలజీ సంబంధిత సమస్యల బారిన పడుతున్నారు. బరువు ఎక్కువగా ఉండి, వ్యాయామం తక్కువ చేయడం వల్ల లివర్‌లో కొవ్వు చేరే ప్రమాదం ఉంది. మద్యం ఎక్కువగా సేవించేవారికి వచ్చే లివర్ జబ్బులన్నీ కూడా వ్యాయామం చేయని సాధారణ వ్యక్తులకు వచ్చే అవకాశం ఉంది. దీని నివారణ కోసం ప్రతిరోజూ ఎక్కువ సేపు నడవడం మంచిది.

బాధితులు అధికమే



లివర్, జీర్ణకోశ వ్యాధులపై ప్రజలకు అనేక అపోహలు ఉన్నాయి. అవగాహన లేకపోవడం వల్ల అనేక మంది ప్రాథమిక దశలో వ్యాధులను గుర్తించక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రతిరోజూ గుంటూరు జీజీహెచ్‌కు 150 మంది వివిధ రకాల గ్యాస్ట్రోఎంట్రాలజీ సమస్యతో చికిత్స కోసం వస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 15 మంది గ్యాస్ట్రోఎంట్రాలజీ వైద్యులు ఉన్నారు. ప్రతిరోజూ ఒక్కో వైద్యుడి వద్దకు 20 నుంచి 50 మంది వివిధ రకాల సమస్యలతో చికిత్స కోసం వస్తున్నారు. గుంటూరు జీజీహెచ్‌లో కోత, కుట్లు లేకుండా ఎండోస్కోపిక్ అల్ట్రాసౌండ్ ద్వారా అన్ని రకాల అత్యాధునిక ఆపరేషన్లు, వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నాం.

– డాక్టర్ షేక్ నాగూర్‌బాషా, గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్, గుంటూరు జీజీహెచ్

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

అధికారులకు సూచించిన ఎమ్మెల్యే ముస్తఫా



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని ఆయన కార్యాలయంలో మంగళవారం ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమై పలు అభివృద్ధి పనుల గురించి చర్చించారు. గత కౌన్సిల్ సమావేశంలో తీర్మానించిన అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు ఎందుకు సిద్ధం చేయలేదని అధికారులను ఎమ్మెల్యే ముస్తఫా ప్రశ్నించారు. అదేవిధంగా గడపగడపకు మన ప్రభుత్వంలో సమస్యల పనులకు సంబంధించి టెండర్ల వరకు వచ్చి ఎందుకు నిలిచాయని, బస్టాండ్ ఎదుట, మణిపురం వంతెన వద్ద డ్రెయిన్ నిర్మించాలని చెప్పిన విషయాన్ని మరోమారు గుర్తు చేశారు. సామాజిక భవనాల నిర్మాణాలపై ప్రతిపాదనలు సిద్ధం చేసి, టెండర్లు పూర్తి చేయాలని, పాతగుంటూరు రాజీవ్‌గృహకల్ప రోడ్డులో సీసీ రోడ్డు నిర్మించాలని తెలిపారు. 51వ డివిజన్ మాలకొండయ్య కాలనీలో అభివృద్ధి పనులు ప్రారంభించలేదని, ఓల్డ్‌క్లబ్ రోడ్డులో అసంపూర్తిగా కల్వర్టు పనులు చేశారని, 13వ డివిజన్ చెక్కలబజారులో రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉందని, అదే డివిజన్ బాపూజీరోడ్డు, గుంట ఫ్యాక్టరీ రోడ్డు, రెడ్లబజారులో విద్యుత్ స్తంభాల ఏర్పాటు వంటి పెండింగ్ పనులు పూర్తి చేయాలని సూచించారు. 57వ డివిజన్ గణేష్‌నగర్, 54వ డివిజన్ అభివృద్ధి పనులు చేయాల్సి ఉందని, మూడు వంతెనల వద్ద ఒక లేయర్ బీటీ రోడ్డు నిర్మించాలని సూచించారు. సమావేశంలో ఈఈ కోటేశ్వరరావు, డీఈ శ్రీనివాసరెడ్డి, ఏఈలు రాంబాబు, సేతుబాబు, అనూష్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

అదనపు కమిషనర్ పి.రోజా



సచివాలయ సెక్రటరీలతో మాట్లాడుతున్న అదనపు కమిషనర్ పి.రోజా

నెహ్రూనగర్: నగరంలోని వార్డు సచివాలయ కార్యదర్శులు తప్పనిసరిగా సమయ పాలన పాటిస్తూ, పనివేళల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని, సచివాలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తప్పవని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పెద్ది రోజ స్పష్టం చేశారు. మంగళవారం కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు పెద పలకలూరు రోడ్డులోని ఉద్యోగనగర్ 109 వార్డు సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసి, విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న అడ్మిన్, శానిటేషన్, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రోసెసింగ్, ప్లానింగ్ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. తొలుత సచివాలయ కార్యదర్శుల హాజరు సక్రమంగా లేకపోవడం, సమావేశాల మినిట్స్, సచివాలయ నిర్వహణ సరిగా లేకపోవడంపై అడ్మిన్ కార్యదర్శి, సచివాలయం పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంపై శానిటేషన్ కార్యదర్శి, జాబ్ చార్ట్, రోజువారీ పనిపై అవగాహన లేకుండా ఉండడంపై ప్లానింగ్ కార్యదర్శి, సచివాలయం రికార్డ్ నిర్వహణ సరిగా లేకుండటపై ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రోసెసింగ్ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అనంతరం కార్యదర్శులతో అదనపు కమిషనర్ మాట్లాడుతూ పని వేళల్లో క్షేత్ర స్థాయిలో విధుల్లో ఉంటే సంబంధిత మూమెంట్ రిజిస్టర్‌లో తప్పనిసరిగా నోట్ చేయాలని, ప్రభుత్వ పథకాల అర్హుల, అనర్హుల, పథకాల పోస్టర్స్ సచివాలయాల్లో క్రమపద్ధతిలో కనిపించేలా అంటించాలన్నారు. ప్రతి కార్యదర్శి గుర్తింపు కార్డ్, యూనిఫామ్ ధరించాలన్నారు. స్పందన అర్జీలు నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు.

జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

పెంచిన, నూతన పెన్షన్లు పంపిణీ



పింఛన్ నగదును అందజేస్తున్న వంగల హేమలత, వలివీరారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి

కొరిటిపాడు(గుంటూరు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ కానుక పెంచి పేద వర్గాల కళ్లల్లో ఆనందం నింపారని 44వ డివిజన్ కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు వంగల హేమలత అన్నారు. స్థానిక 44వ డివిజన్‌లోని 131, 132, 133, 138, 140 సచివాలయాల పరిధిలోని లబ్ధిదారులకు నూతన పెన్షన్లు, పెంచిన వైఎస్సార్ పెన్షన్ కానుక నగదును మంగళవారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వాన్ని అవ్వ తాతలు, అక్క, చెల్లెమ్మలు అందరూ ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్‌లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇక నుంచి ప్రతి నెలా రూ.2,750లు అందజేయడం జరుగుతుందని వివరించారు. ఆయా సచివాలయాల పరిధిలో నూతనంగా మంజూరైన 32 మందికి పింఛన్ల సొమ్మును ఆమె పంపిణీ చేశారు. పార్టీ నాయకులు వంగల వలివీరారెడ్డి, చాగంటి విష్ణువర్ధన్‌రెడ్డి, రాజేష్, సుబ్బు, చిలకా సురేష్, అమరనాథ్‌రెడ్డి, గంగాధర్, వినోద్, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయురాలు సావిత్రిబాయి పూలే



ఆర్జేడీ జ్యోత్స్నకుమారిని సత్కరిస్తున్న అధ్యాపక బృందం



వరలక్ష్మిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ జ్యోత్స్నకుమారి

కళాశాల విద్య ఆర్జేడీ జ్యోత్స్నకుమారి

గుంటూరు ఎడ్యుకేషన్: ఆధునిక మహిళావిద్యకు ఆద్యురాలు సావిత్రిబాయి పూలే అని కళాశాల విద్య ఆర్జేడీ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి అన్నారు. మంగళవారం దేశ ప్రథమ మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో మహిళాభివృద్ధి విభాగం 'ప్రమదావనం' ఆధ్వర్యంలో నిర్వహించిన సావిత్రిబాయి పూలే జయంతి సభలో ఆర్జేడీ జ్యోత్స్నకుమారిని సత్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ మహిళలకు చదువు నేర్పించేందుకు కంకణం కట్టుకున్న సావిత్రిబాయికి తీవ్ర వ్యతిరేకత ఎదురైనప్పటికీ, ప్రతిబంధాలను అధిగమించి చేసిన కృషి వలనే ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభ చాటుతున్నారని అన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ పీఎం ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్, ప్రమదావనం కన్వీనర్ వి.బ్యూలారాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సావిత్రిబాయిపూలే ఆశయ సాధనకు కృషి చేయాలి...

నెహ్రూనగర్: దేశంలో మొట్టమొదటిసారిగా బహుజనులకు చదువు నేర్పిన గొప్ప సంఘ సంస్కర్త సావిత్రిబాయిపూలే అని బహుజన పొలిటికల్ సెంటర్ రాష్ట్ర కన్వీనర్ వై.కోటేశ్వరరావు(వైకే) తెలియజేశారు. మంగళవారం సావిత్రిబాయిపూలే జయంతిని పురస్కరించుకుని అరండల్‌పేటలోని అంబేడ్కర్ మినీ హాల్ నందు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే బాటలోనే ఉపాధ్యాయులు నడుస్తూ బహుజనులను చైతన్యం చేయాలన్నారు. బహుజన నాయకులు జూపూడి శ్రీనివాసరావు, గంటా ప్రభుదాస్, జీఆర్ భగత్‌సింగ్ పాల్గొన్నారు.

పీడిత మహిళల ఆశాజ్యోతి..

గుంటూరు ఎడ్యుకేషన్: పీడిత మహిళల ఆశాజ్యోతిగా నిలిచిన సావిత్రిబాయి పూలే దేశంలో తొలితరం ఉద్యమకారిణి అని ఎస్టీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు పేర్కొన్నారు. కంకరగుంటలోని ఎస్టీయూ భవన్‌లో మంగళవారం సావిత్రిబాయి పూలే 192వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సుధీర్‌బాబు మాట్లాడుతూ ఆధునిక భారతదేశంలో ప్రథమ మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి అని అన్నారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గేరా మోహన్‌రావ మాట్లాడారు. ఈసందర్భంగా పలువురు ఉపాధ్యాయినులను సత్కరించారు. ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా నరసింహారావు, రాష్ట్ర మహిళా కన్వీనర్ సీహెచ్ ఉమా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా కళాశాలలో...

గుంటూరు ఎడ్యుకేషన్: మహిళా విద్యకు నాంది పలికిన సావిత్రీబాయిని విద్యార్థినులు స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రభుత్వ మహిళా కళాశాల విశ్రాంత ఆంగ్ల అధ్యాపకురాలు డాక్టర్ బి. వరలక్ష్మి పేర్కొన్నారు. సాంబశివపేటలోని మహిళా కళాశాలలో మంగళవారం సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా డాక్టర్ వరలక్ష్మికి సావిత్రీబాయి పూలే పురస్కారాన్ని ప్రదానం చేశారు. పురస్కార గ్రహీత వరలక్ష్మి మాట్లాడుతూ స్త్రీ విద్యకు నాంది పలికిన సావిత్రీబాయి పాఠశాలలను స్థాపించి, మహిళా విద్యాభివృద్ధి కోసం పాటుపడ్డారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ ఈ ఏడాది నుంచే కళాశాలలో ప్రవేశపెట్టిన సావిత్రీబాయి పూలే పురస్కారాన్ని ప్రప్రథమంగా డాక్టర్ వరలక్ష్మికి బహుకించినట్లు తెలిపారు.

చంద్రబాబుకు ప్రచారపిచ్చి పట్టింది

ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్

గురజాల: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ప్రచార పిచ్చి పట్టిందని గుంటూరు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. గురజాలలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కందుకూరులో 8 మంది, గుంటూరులో ముగ్గురు మృతికి తెలుగుదేశం పార్టీ, నారా చంద్రబాబునాయుడు పూర్తి బాధ్యత వహించాలన్నారు. చీర, చింతపండు, నూనె పంచేందుకు మాజీ ముఖ్యమంత్రి హోదాలో వుండి రావడం ఏమిటన్నారు? తొక్కిసలాటలో చనిపోయింది అందరూ నిరుపేదలే నన్నారు. కానుకలు ఇస్తాము రండి అని పిలవడం ఎప్పుడూ వినలేదన్నారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పని చేసి గిఫ్టులు ఇస్తాము రండి అనడం కూడా చట్టరీత్యా నేరమేనన్నారు. మీటింగ్‌కు ఎంతమంది వస్తారు, అన్న వివరాలు ముందుగా పార్టీ నాయకులు పోలీసులకు తెలియచేసే విధంగా చూడాలని, మరలా ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డీజీపీని కోరతామన్నారు. అమాయకుల మృతికి చంద్రబాబు బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ పోలు పవన్మయి వీరారెడ్డి, వైస్ చైర్మన్ మన్నెం కన్యాకుమారి ప్రసాద్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ ప్రగతి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవాసమితి భవనంలో వృద్ధాశ్రమం

గుంటూరు మెడికల్: బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన భవనంలో వద్ధాశ్రమం, విద్యార్థి వసతి గృహం ఏర్పాటు చేసినట్లు బ్రాహ్మణ సేవాసమితి అధ్యక్షుడు అధ్యక్షుడు ఆర్.లక్ష్మీపతి చెప్పారు. మంగళవారం స్థానిక బ్రాడిపేటలోని బ్రాహ్మణ సేవా సమితిలో జరిగిన విలేకరుల సమావేశంలో తమ సమితి చేస్తున్న కార్యక్రమాలను కార్యదర్శి కొప్పర్తి సీతారమేష్‌తో కలిసి వెల్లడించారు. నూతన భవనంలో పది మంది వృద్ధులకు, 50 మంది విద్యార్థులకు వసతి ఏర్పాటు చేశామన్నారు. జనవరి నెలాఖరుకు భవనం ప్రారంభమవుతోందన్నారు. రాష్ట్రస్థాయి వివాహ పరిచయ వేదిక కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు సమితి ఉపాధ్యక్షులు కర్లపాలెం బాలకష్ణ, గొల్లపూడి రామకష్ణారావులను సత్కరించారు. ఈనెల 8న బ్రాహ్మణ సేవా సమితి ప్రాంగణంలో ముగ్గుల పోటీలు జరుగుతాయన్నారు. జాయింట్ సెక్రటరీ రవికుమార్, కార్యనిర్వాహక సభ్యులు రాంగోపాల్, శ్రీనాథ్, రాధాకృష్ణ, సాయిబాబా శర్మ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

స్పందన ఈడా ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజంలో యువత క్షణికమైన ఆవేశాలతో జీవితాలను పాడు చేసుకోకుండా గత మూడేళ్లుగా అనేక చైతన్యవంతమైన కార్యక్రమాల ద్వారా దిశా నిర్దేశం చేస్తున్న స్పందన ఈడా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సామాజిక సేవలు ఎంతగానో అభినందనీయమని జిల్లా ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఎస్పీ కేజీవీ సరిత పేర్కొన్నారు. మంగళవారం స్పందన ఈడా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ శామ్యూల్ రెడ్డి కుమార్తె స్పందన మూడో జయంతి సందర్భంగా జూమ్ యాప్ ద్వారా 'గుర్తుందా చిన్న! నీకు గుర్తుందా?!' అనే ఆడియో పాటను విడుదల చేశారు. ఈసందర్భంగా ఎస్పీ సరిత మాట్లాడుతూ జీవితం చాలా విలువ విలువైనదని, ఏ సమస్య ఉన్నా మనోధైర్యంతో ముందుకు వెళ్లాలని యువతను కోరారు. ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ శామ్యూల్ రెడ్డి మాట్లాడుతూ యువతను పరిపూర్ణమైన వ్యక్తులుగా, వ్యవస్థగా మార్చాలని ఉద్దేశంతో ఆడియో పాటకు అనుగుణంగా డాన్స్ కంపోజ్ చేసి, వీడియోను spandanaedaif@gmai.com మెయిల్‌కు ఫిబ్రవరి 12వ తేదీలోపు పంపాలని కోరారు. సంబంధించి వీడియోలను యూట్యూబ్ చానల్ ద్వారా ప్రదర్శించి, వీక్షకుల స్పందన, న్యాయ నిర్ణేతలు ఇచ్చిన మార్కుల ఆధారంగా విజేతలను ఎంపిక చేస్తామని చెప్పారు. మరిన్ని వివరాలకు 8885558129, 9010442773 నంబర్లను సంప్రదించాలని శామ్యూల్ రెడ్డి కోరారు. ఫౌండేషన్ ముఖ్య సలహాదారు ప్రొఫెసర్ విశ్వనాథం, డైరెక్టర్ ఇ.అంజిరెడ్డి, నిర్మల, నేషనల్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు

హత్య కేసులో నిందితులు అరెస్ట్

పట్నంబజారు: యువకుడిని రాళ్లతో కొట్టిన చంపిన కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేవీపీ కాలనీకి చెందిన రాయి మణికంఠ క్యాటరింగ్ పనిచేసుకుని జీవనం సాగించేవాడు. వ్యసనాలకు బానిసగా మారిన మణికంఠ నిత్యం రోడ్లపై పడుకోవటం, లాడ్జిల్లో ఉండటం చేస్తుండేవాడు. ఈ 31వ తేదీ రాత్రి గుంటూరు జీజీహెచ్ మార్చురీ వద్ద ఉన్న బస్‌స్టాప్‌లో పడుకునేందుకు వెళ్లాడు. క్యాటరింగ్ పనులు చేసుకునే తెనాలికి చెందిన అరవపల్లి భువనేశ్వర్, విజయవాడకు చెందిన షేక్ ఆసీఫ్‌లతో కలిసి మద్యం సేవించాడు. ఈ క్రమంలో ఏర్పడిన స్వల్ప వివాదం నేపథ్యంలో మణికంఠను రాళ్లతో తలపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులైన భువనేశ్వర్, ఆసీఫ్‌లను ఈ నెల 2వతేదీ సాయంత్రం ఏసీ కళాశాల ఎదురుగా వైట్‌నర్ సేవిస్తుండగా అదుపులోకి తీసుకుని విచారించారు. మణికంఠను హత్య చేసినట్లు అంగీకరించారు. ఈ మేరకు నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు తెలిపారు.

దీపోత్సవం

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయంలోని అన్నమయ్య కళావేదిక ప్రాంగణంలో ధనుర్మాసం సందర్భంగా టీటీడీ ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ సౌజన్యంతో దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య జ్యోతి ప్రజల్వనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్ కోగంటి వేంకట రంగనాయకి ప్రవచనం ఆకట్టుకుంది.

పొగాకు రైతులను ఆదుకోండి

- ఎకరాకు రూ.25 వేలు పరిహారం ఇవ్వాలి
- ఏపీ రైతు సంఘం నాయకుల వినతి



ఈడీ శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న రంగారావు, వెంకటరావు, వెంకటేశ్వర్లు

కొరిటిపాడు(గుంటూరు): మాండూస్ తుపాను ప్రభావం వల్ల పొగాకు పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని పొగాకు బోర్డు మాజీ సభ్యుడు, ఏపీ రైతు సంఘం నాయకుడు చుండూరు రంగారావు కోరారు. పొగాకు పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ భారత పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్ బాబును రైతు సంఘం నాయకులు మంగళవారం జీటీ రోడ్డులోని పొగాకు బోర్డు కార్యాలయంలో కలసి వినతి పత్రం అందజేశారు. రంగారావు మాట్లాడుతూ పొగాకు బోర్డు ఒంగోలు ప్రాంతీయ కార్యాలయం పరిధిలో 1,43,946 ఎకరాల్లో 87.08 మిలియన్ కిలోల పొగాకు పండించడానికి అనుమతి ఇవ్వగా, 1,14,190 ఎకరాల్లో సాగు చేశారని తెలిపారు. మాండూస్ తుఫాన్ వల్ల 59,085 ఎకరాలలో ఎక్కువగాను, 9,587 ఎకరాల్లో పాక్షికంగాను పంట దెబ్బతిని సుమారు 25,256 మంది రైతులు నష్టపోయారని వివరించారు. 50 రోజుల పంట పూర్తయ్యి కొట్టుడుకు వచ్చిన తోటలను పీకివేసి తిరిగి నాట్లు వేయాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు రూ.45 వేలకు పైగా పెట్టుబడి నష్టపోయినట్టు వివరించారు. వర్షాలకు నిలదొక్కుకున్న పొగ తోటల ఎదుగుదల కూడా ఆగిపోయిందని, ఎకరాకు నాలుగు క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. సమగ్ర సర్వే జరిపి, కౌలు రైతులను గుర్తించి నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పూర్తిగా దెబ్బతిన్న పొగ తోటలకు ఎకరాకు రూ.25 వేలు, పాక్షికంగా దెబ్బతిన్న పొగ తోటలకు ఎకరాకు రూ.10 వేలు బోర్డు నిధి నుంచి నష్టపరిహారం ఇప్పించాలని సూచించారు. పొగాకు రైతులకు బ్యాంకుల నుంచి ఇచ్చిన రుణాలు వడ్డీ లేకుండా రీషెడ్యూల్ చేసి, మళ్లీ సాగు చేసుకోవడానికి తక్షణమే బ్యారన్‌కు రూ.లక్ష వడ్డీ లేని రుణం ఇవ్వాలన్నారు. ఫసల్ బీమా యోజన పొగాకు పంటకు వర్తింపజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో రైతు సంఘం నాయకులు పమిడి వెంకటరావు, అబ్బూరి వెంకటేశ్వర్లు, వి.బాలకోటయ్య, షేక్ మాబు, టి.శ్రీకాంత్, కె.అజయ్‌కుమార్ ఉన్నారు.

సచివాలయ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ



సచివాలయ ఉద్యోగులతో కలిసి క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: గ్రామ/వార్డు సచివాలయ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ నూతన క్యాలెండర్‌ను నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు చేతుల మీదుగా ఆవిష్కరించారు. సంపత్‌నగర్‌లోని మేయర్ క్యాంపు కార్యాలయంలో ఉద్యోగులతో కలిసి క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ప్రజలకు మెరుగైన సేవలందించి వారి మన్ననలు పొందాలన్నారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల అంకమ్మరావు, అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ బీఆర్ఆర్ కిషోర్, జిల్లా అధ్యక్షుడు తాడిబోయిన రాజేష్, జనరల్ సెక్రటరీ అనిల్ రాథోడ్, ధనలక్ష్మి, చైతన్య, కమల్‌హాసన్, తోట మహేష్, చల్లా శ్రీనివాస్ ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.